క్లుప్తంగా

పెడనలో మెప్మా మహిళా మార్కెట్

పెడన: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి డ్వాక్రా మహిళల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని పెడన మున్సిపల్ సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటుచేసిన మెప్మా అర్బన్ మహిళ మార్కెట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పట్టణ ప్రజలు డ్వాక్రా అర్బన్ మార్కెట్‌ను సందర్శించి వారికి సహకారం అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పెడన టౌన్ సచివాలయాల కన్వీనర్ మతీన్‌ఖాన్, భోగేశ్వరరావు, సీసీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఫిష్ ఆంధ్రా యూనిట్ ప్రారంభం

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం బుట్టాయిపేటలో ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్రా లాంజ్ యూనిట్‌ను నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. ఫిష్ ఆంధ్రా లాంజ్ యూనిట్‌ను శుక్రవారం కిట్టు ప్రారంభించారు. నక్షత్ర హోటల్ నిర్వాహకుల ఆధ్వర్యంలో దీనిని ఏర్పాటు చేశారని, ఈ యూనిట్‌లో చేపలు, రొయ్యలు, పీతలకు సంబంధించిన వంటకాలు అందుబాటులో ఉంటాయన్నారు. మత్స్య శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ మత్స్యసంపద వంటకాలు నగర ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ లాంజ్ యూనిట్‌ను ప్రారంభించామని చెప్పారు. కార్యక్రమంలో మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, కార్పొరేటర్లు, యూనిట్ నిర్వాహకులు సామా గణేష్, సామా నాగశాలిని కుమారి, జిల్లా మత్స్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.3.76 కోట్లతో రోడ్ల నిర్మాణాలు, మరమ్మతులు

పెడన: పెడన వ్యవసాయ మార్కెట్ కమిటీ నిధులు రూ.3.76 కోట్లను పెడన, గూడూరు మండలంలోని పలు రోడ్ల నిర్మాణానికి, మరమ్మతులకు కేటాయించామని పెడన మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గరికపాటి చారుమతి అన్నారు. శుక్రవారం ఆమె పెడన వ్యవసాయ మార్కెట్ ఆవరణలో రూ.40 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ పెడన మండలంలో కొంకేపూడి నుంచి ఈదుమూడికి, కాకర్లమూడిలోనీ పీబీజీ రోడ్డు నిర్మాణలతో పాటు గూడూరు మండలంలోని నాలుగు రోడ్లకు రూ.3.76 కోట్ల నిధులు కేటాయించామన్నారు. గూడూరు మండలంలో రోడ్ల నిర్మాణాలు, మరమ్మతులు చేస్తామని చెప్పారు. ఆయా పనులను త్వరలో ప్రారంభించి నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పెనుమల్లి సర్పంచ్ గరికపాటి వెంకట రామానాయుడు, ఏఎంసీ వైస్ చైర్మన్ మెరుగుమాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు బహిరంగ వేలం

పెడన: పట్టణంలోని పైడమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఈనెల 26 నుంచి 2024 జనవరి ఐదో తేదీ వరకు జరుగుతాయని, ఈ జాతర ఉత్సవాల్లో పలు అంశాలకు సంబంధించి బహిరంగ వేలం పాటలను శనివారం నిర్వహిస్తామని ఆలయ ఈఓ టీవీవీ మోహనరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారి దేవస్థానం చుట్టు పక్కల ఖాళీ స్థలాల్లో దుకాణాల ఏర్పాటు, పార్కింగ్ స్థలానికి, శిడిబండ్లు, బోనాలు, మేకపోతులు, కోళ్లు, పశువులు, వాహనాలు వగైరాలతో యాత్రికులు దేవస్థానం చుట్టూ తిప్పుకొనుటకు రుసుం వసూలు చేసుకునేందుకు, కొబ్బరి చెక్కలు, చీరలు, రవికలు పోగు చేసుకునేందుకు, లడ్డూ ప్రసాదం విక్రయ హక్కులను పొందడానికి బహిరంగ వేలం జరుగుతుందన్నారు. వేలం పాటలు శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ఆలయ ప్రాంగణంలో జరుగుతాయన్నారు.

జర్నలిస్ట్ కుటుంబానికి సాయం

అవనిగడ్డ: గతనెలలో ఆత్మహత్య చేసుకున్న చల్లపల్లికి చెందిన జర్నలిస్ట్ క్లోపల్లి చంద్ర కుటుంబానికి ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) అవనిగడ్డ డివిజన్ రూ.25 వేలు ఆర్థిక సహాయం అందించింది. స్థానిక నవజీవన్ స్కూల్ వద్ద శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఈ మొత్తాన్ని అవనిగడ్డ ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు అప్పికట్ల శ్రీనివాసరావుకి అందజేశారు.

కంటైనర్ ఢీకొని వ్యక్తికి గాయాలు

మోపిదేవి: మోపిదేవి వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. ఎస్ఐ కేవీవీ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. కొక్కిలిగడ్డ పంచాయతీ పరిధి బండికోళ్లంకకు చెందిన వాసుపల్లి నారాయణ ద్విచక్ర వాహనంపై మోపిదేవి వస్తుండగా రేపల్లె వైపు నుంచి వచ్చిన కంటైనర్ లారీ వేగంగా ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టి డివైడర్ పైకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నారాయణను 108 వాహనంలో అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రికి, అనంతరం మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు కోటి దీపోత్సవం

నాగాయలంక: కృష్ణానది తీరంలోని శ్రీరామ పాదక్షేత్రం పుష్కరఘాట్ వద్ద శనివారం రాత్రి శ్రీరామ పాదక్షేత్రం కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో కోటి కార్తిక దీపోత్సవం జరుగుతుందని క్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, క్షేత్ర పాలకుడు తలశిల రఘుశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు దీపోత్సవం ప్రారంభమవుతుందని, దివిసీమ వ్యాప్తంగా భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తారని చెప్పారు. శ్రీరామలింగేశ్వరునికి నిత్య నవ హారతులు యథావిధిగా జరుగుతాయన్నారు. కోటి దీపోత్సవంలో ప్రమిదల ఏర్పాటు, రంగవల్లులు తీర్చిదిద్దడం, ప్రమిదల్లో నూనె పోసేందుకు ఉత్సాహం, ఆసక్తి కలిగిన మహిళలు స్వచ్ఛంద సేవలో పాల్గొన వచ్చునన్నారు.

పేదల ఆర్థికాభ్యున్నతే లక్ష్యం

- ఇంటింటా వెలుగులు నింపిన ప్రభుత్వ పథకాలు
- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- అసైన్డ్, లంక భూముల రైతులకు పట్టాల పంపిణీ



రైతులకు పట్టాలు అందిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

కోడూరు: పేదలందరినీ ఆర్థికంగా సంపన్నులను చేసి, వారి కుటుంబాలు ఆర్థిక పరిపుష్టి సాధించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మండలంలోని రామకృష్ణాపురం, పిట్టల్లంక పంచాయతీలోని రైతులకు అసైన్డ్, లంక భూములకు సంబంధించిన పట్టాలను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చేతుల మీదుగా పంపిణీ చేశారు. తహసీల్దార్ షేక్ లతీఫ్ పాషా అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ పేదల జీవన విధానంలో అనేక మార్పులు తీసుకువచ్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వివిధ సంక్షేమ పథకాల ద్వారా కోడూరు మండల ప్రజలు రూ.292.50 కోట్ల మేర లబ్ధిపొందారని చెప్పారు. విద్య, వైద్యం, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని చెప్పారు. కరోనా లాంటి కష్ట సమయంలో కూడా జగనన్న ప్రభుత్వం ప్రజలకు అండగా నిలిచిన విషయాన్ని రమేష్‌బాబు గుర్తుచేశారు.

చెప్పాడంటే.. చేస్తాడంతే

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటారని ఎమ్మెల్యే సింహాద్రి అన్నారు. 2019 ఎన్నికల ప్రచారానికి అవనిగడ్డకు వచ్చిన సమయంలో 22ఏ నిషేధిత భూముల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఇచ్చిన హామీని నేరవేరుస్తూ నిషేధిత జాబితా నుంచి భూములను విముక్తి చేసి పట్టాలను పంపిణీ చేశారని చెప్పారు. దీనితో దివిసీమలోని కోడూరు, నాగాయలంక మండలాల్లోనే సుమారు 10 వేల మంది రైతులకు లబ్ధి చేకూరిందన్నారు. కృష్ణానదిపై ఉన్న ఉల్లిపాలెం-భవానీపురం వారధికి అంబటి బ్రాహ్మణయ్య వారధిగా నామకరణం చేస్తామని చెప్పి ఆ హామీని కూడా నేరవేర్చారని తెలిపారు. త్వరలోనే ఎదురుమొండి వారధి నిర్మాణం కూడా ప్రారంభిస్తామని రమేష్‌బాబు చెప్పారు.

208 మంది రైతులకు పట్టాలు పంపిణీ..

రామకృష్ణాపురం పంచాయతీ పరిధిలోని ఊటగుండం, రామకృష్ణాపురం, ఇరాలి గ్రామాల పరిధిలోని 125 మంది రైతులకు 174.73 ఎకరాల అసైన్డ్ భూములకు సంబంధించిన పట్టాలను రమేష్‌బాబు చేతుల మీదుగా పంపిణీ చేశారు. వీటితో పాటు పిట్టల్లంక పంచాయతీ పరిధిలో 83 మంది రైతులకు 86.13 ఎకరాల లంక భూములకు సంబంధించిన లీజు పట్టాలను పంపిణీ చేశారు. అసైన్డ్ భూముల్లో రైతులు అనాదిగా సాగు చేసుకుంటున్నారని, వీరికి ఆ భూమిపై హక్కు కల్పిస్తూ ఈ పట్టాలను అందించామని ఎమ్మెల్యే తెలిపారు. పట్టాలు అందుకున్న రైతులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, పార్టీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, రైతు విభాగం జిల్లా కార్యదర్శి కొండవీటి వీరవెంకటనారాయణరావు, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ గుర్రం బసవయ్య, బీసీ, ఎస్సీ సెల్ కన్వీనర్లు చేబోయిన కృష్ణారావు, వెన్నా ప్రసాద్, కడవకొల్లు శ్రీనివాసరావు, కోట పద్మావతి వరప్రసాద్, ఎంపీటీసీ బడే గంగాధరరావు, ముక్కు వెంకటేశ్వరరావు, ముద్దినేని చంద్రరావు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహనా ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు

కోనేరుసెంటర్: ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చిన్నాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ టి. పావని, డాక్టర్ లాస్యహరిత అన్నారు. మండల పరిధి చిన్నాపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది శుక్రవారం ఎయిడ్స్‌పై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ వ్యాధి వ్యాప్తి, నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ సీహెచ్‌వీ వసుంధరదేవి, హెచ్‌వీ భారతి, ఏఎన్‌ఎంలు, ఆశాలు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ బదిలీ

చిలకలపూడి(మచిలీపట్నం): పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎ. శ్రీధర్ శుక్రవారం బదిలీ అయ్యారు. ఆయనను రాష్ట్ర కార్యాలయానికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఉయ్యూరు ఆర్డీఓగా పని చేస్తున్న దాసి రాజు కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ పి. రాజాబాబు ఆదేశాలు జారీ చేశారు.

నవరత్నాలతో ప్రజల జీవితాల్లో వెలుగులు

- మంత్రి జోగి రమేష్
- రామరాజుపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం


స్థానికులకు పథకాల లబ్ధిని వివరిస్తున్న మంత్రి జోగి రమేష్

గూడూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అమలు చేస్తున్న నవరత్నాలు పథకాల ద్వారా పేద, మధ్య తరగతి ప్రజల జీవన స్థితిగతుల్లో ఎంతో మార్పు కనిపిస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం గూడూరు మండలం రామరాజుపాలెం సచివాలయం పరిధిలోని చిట్టిగూడూరు, రామరాజుపాలెం గ్రామాల్లో నిర్వహించారు. మంత్రి జోగి రమేష్ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించి బ్రోచర్లను అందజేశారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందుతున్నాయో లేదో తెలుసుకునేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సీఎం జగనన్న ఎంతో దూరదృష్టితో రూపకల్పన చేసి ఎన్నికల మేనిఫేస్టోలో పెట్టిన విధంగా గత నాలుగున్నరేళ్లుగా నవరత్నాలు పథకాలు రాష్ట్రంలో అమలు అవుతున్నాయన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో వందలాది మంది ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందుతున్నారన్నారు. జగనన్న సంక్షేమ పాలనకు నవరత్నాలు అందుకుంటున్న లబ్ధిదారులే ప్రత్యక్ష సాక్ష్యం అని మంత్రి చెప్పారు. రాష్ట్రంలో అమలు అవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా ప్రజలకు జగనన్నపై అంతులేని నమ్మకం కుదిరిందన్నారు. ప్రజా రంజక పాలన కొనసాగాలంటే వచ్చే ఎన్నికలలో ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు నిండు మనస్సుతో ఆశీర్వదించాలని ఆయన కోరారు.

సమస్య పరిష్కారంపై హామీ

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పర్యటించిన మంత్రి జోగి రమేష్ దృష్టికి స్థానిక ప్రజలు పలు సమస్యలను తీసుకురాగా స్పందించిన మంత్రి వాటి పరిష్కారానికి హామీ ఇచ్చారు. చిట్టిగూడూరులో కుళాయి ద్వారా తాగునీరు, అంతర్గత రహదారులు, డ్రెయిన్లు నిర్మించాలని స్థానికులు కోరగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి మంజూరయ్యే నిధులతో చేపడతామని హామీ ఇచ్చారు. జల్ జీవన్ మిషన్ ద్వారా రూ.20 లక్షలతో ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీటిని సరఫరా చేస్తామని చెప్పారు. రామరాజుపాలెంలో నివేశన స్థలాల సమస్యను స్థానికులు మంత్రి దృష్టికి తీసుకువెళ్లగా... వైఎస్సార్ జగనన్న కాలనీలో పట్టాలు ఇచ్చిన భూములపై కొందరు కోర్టుకు వెళ్లారని మంత్రి వివరించారు. కోర్టు కేసు పరిష్కారం కాగానే ఇళ్ల పట్టాలు ఇచ్చిన చోట ఇళ్లు కట్టుకునేందుకు రుణాలు కూడా మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఎంపీపీ సంగా మధుసూదనరావు, కేడీసీసీబీ డైరెక్టర్ తలుపుల వెంకట కృష్ణారావు, పెడన మార్కెట్ యార్డు చైర్మన్ గరికపాటి చారుమతి, పర్లం పెద బాబు, ఏపీఎస్ఎఫ్‌సీ డైరెక్టర్ కె. కామేశ్వరరావు, సర్పంచులు లంకా చంద్రలీల, పరసా రాజు, ఎంపిటీసీ జక్కా ధర్మారాయుడు పాల్గొన్నారు.

పూరిళ్ల నుంచి పక్కా భవనాల్లోకి వెళ్లాం


జగనన్న కాలనీలో నిర్మించిన పక్కా భవనాలు


మాట్లాడుతున్న కాలనీ లబ్ధిదారులు

- మా జీవితాలు మార్చిన దేవుడు జగనన్న
- మోపిదేవి జగనన్న కాలనీవాసులు

మోపిదేవి: బిల్డింగ్‌లలో ఉంటామని మా జీవితంలో ఏనాడూ ఊహించలేదు.. అలాంటిది మా దేవుడు జగనన్న మాకు స్థలం ఇవ్వడంతో పాటు పక్కా భవనాలు నిర్మించారని మోపిదేవిలోని యానాది కాలనీ వాసులు శుక్రవారం సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు కట్టిస్తున్న పక్కా భవనాలపై కొంతమంది లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని వారు వాపోయారు. తమకు చదువు లేదని, ఇంకా సాయం చేస్తారనే ఆశతో రోడ్డు వేయాలని మీడియాకు (సాక్షి కాదు) చెప్పామని ఆవేదన వ్యక్తంచేశారు. అలా చెప్పినందుకు బాధపడుతున్నామన్నారు. పూరి గుడిసెల్లో తలదాచుకునే తమకు జగనన్న పక్కా భవనాలు కట్టించి విద్యుత్ ఇచ్చారని, రహదారి సౌకర్యం కూడా కల్పిస్తామని అధికారులు చెప్పారని తెలిపారు. ఆధార్‌కార్డు, రేషన్ కార్డులతో పాటు పింఛన్లు కూడా జగనన్న అందిస్తున్నారని, ఇంత మంచి చేస్తున్న సీఎం జగనన్నను ఎప్పటికీ మరచిపోలేమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, అధికారులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. గృహ లబ్ధిదారులు చెట్టు గంగాధరరావు, చెట్టు లక్ష్మి, చిట్టిమోతు వెంకట లక్ష్మి, మట్టా రోజా తదితరులు మాట్లాడారు.

సంక్షేమ పథకాల అమలుతో గొప్ప మార్పు

- ఉత్సాహంగా 'ఏపీకి జగనే ఎందుకు కావాలి'
- సంక్షేమ పథకాల బోర్డుల ఆవిష్కరణ


సార్లగొందిలో సంక్షేమ బోర్డును ఆవిష్కరించిన ప్రజాప్రతినిధులు, అధికారులు


నందిగామలో సంక్షేమ బోర్డును ఆవిష్కరించిన నాయకులు

సార్లగొంది(నాగాయలంక): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలతో ప్రజల జీవనంలో గొప్ప మార్పు వచ్చిందని జెడ్పీటీసీ మోకా బుచ్చిబాబు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మద్ది వెంకట నారాయణ (చిన్నారి), వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భోగాది శేషగిరి రావు అన్నారు. సార్లగొంది సచివాలయం వద్ద శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి, పల్లెకు పోదాం కార్యక్రమాలు నిర్వహించారు. సంక్షేమ పథకాల బోర్డును, పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి వారు మాట్లాడారు. నాయకులు, ప్రజాప్రతినిధులు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. పీఏసీఎస్ చైర్‌పర్సన్ తోట సాయిబాబు (బర్రంకుల), పూర్వ డీసీ మాజీ చైర్మన్ బీసాబత్తుని ప్రసాద్, తోట కృష్ణ, వనమాల రమేష్, చిట్టా బాలమురళి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ సిబ్బంది, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

- పెడన: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉంటేనే నిరుపేదలందరికీ సంక్షేమ పథకాలు అందతాయని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొండవీటి నాగబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని నందిగామ గ్రామ సచివాలయం వద్ద ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ బోర్డును, పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. నాయకులు గరికపాటి వెంకట రామానాయుడు, బెజవాడ నాగబాబు, సుబ్రహ్మణ్యం, దావు బైరవలింగం, ఎంపీటీసీ బొడ్డు గురునాథం, కటికల జోజి, ఈఓపీఆర్డీ జయరాం పాల్గొన్నారు.
- బంటుమిల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో పేదరిక నిర్మూలన సాధ్యమని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం ములపర్రు గ్రామంలో జరిగింది. సంక్షేమ పథకాల బోర్డును, పార్టీ పతాకాన్ని నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు అమలు చేశారని చెప్పారు. పేదల జీవితాల్లో ఎంతో మార్పు వచ్చిందని వివరించారు. ములపర్రు పంచాయతీ పరిధిలోని జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. మరోసారి సీఎంగా జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. ములపర్రు కాపుటూరు, గొల్లగూడెం, దళితవాడ, రామన్నమోడి గ్రామాల్లో పర్యటించి స్థానికులకు కరపత్రాలు అందజేశారు. వైస్ ఎంపీపీ ఒడిమి చిన్నారిబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ పాలడుగు బాబూరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నుజ్జూనం మహేష్, గ్రామ కన్వీనర్ గొరిశెట్టి వెంకట్రామయ్య, నాయకులు పాల్గొన్నారు.
- పాగోలు(చల్లపల్లి): పాగోలులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ తోట శ్రీనివాసరావు సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. గ్రామంలో వైఎస్సార్ సీపీ పతాకాన్ని మండల అధ్యక్షుడు నాని ఎగురవేశారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ మేనిఫెస్టో, వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో చూపించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీలు అమలు చేసిన తీరు, టీడీపీ మేనిఫెస్టో అమలు చేయని విధానం పేదలకు వివరించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాల్సిన ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పైడిపాముల వెంకటేశ్వరరావు, జేసీఎస్ మండల కన్వీనర్ యడ్ల జగదీష్, నాయకులు వెనిగళ్ల జగదీష్, జుజ్జువరపు భాగ్యారావు, మేరుగు రమేష్ పాల్గొన్నారు.
- గూడూరు: ఆకులమన్నాడు గ్రామ సచివాలయంలో శుక్రవారం ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డు, వైఎస్సార్ సీపీ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గూడూరు మండల కన్వీనర్ పర్లం పెదబాబు, గూడూరు మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఫైజుల్ రహ్మాన్, తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ ఆస్పత్రికి వెళ్లి పింఛను అందజేత


విజయవాడ ఆస్పత్రిలో చంద్రశేఖర శాస్త్రికి పింఛను అందజేస్తున్న వలంటీర్ పర్వీన్

మచిలీపట్నంటౌన్: పదో డివిజన్‌కు చెందిన వృద్ధుడు దేవరకొండ చంద్రశేఖర శాస్త్రి అనారోగ్యంతో విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కార్పొరేటర్ షేక్ ముంతాజ్‌బేగం సూచనల మేరకు వలంటీర్ షేక్ పర్వీన్ శుక్రవారం విజయవాడ ఆస్పత్రికి వెళ్లి చంద్రశేఖర శాస్త్రికి వృద్ధాప్య పింఛను అందజేసింది. లబ్ధిదారుడు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.

బందరులో 90.79 శాతం పింఛన్ల పంపిణీ

మచిలీపట్నంటౌన్: వైఎస్సార్ సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం మచిలీపట్నంలో శుక్రవారం తెల్లవారుజాము నుంచే ప్రారంభమైంది. వలంటీర్లు తెల్లవారు జామునే లబ్ధిదారుల గృహాలకు వెళ్లి తలుపుతట్టి పింఛను సొమ్ము అందజేశారు. నగరంలో 18,977 పింఛన్లు ఉండగా వీటిలో 17,229 పింఛన్లను వలంటీర్లు పంపిణీ చేసి 90.79 శాతం సాధించారు. ఇంకా 1,748 పింఛన్లు పంపిణీ చేస్తే నూరు శాతం పింఛన్ల పంపిణీ పూర్తవుతుంది. 8వ డివిజన్ అరుణోదయ కాలనీలో దివ్యాంగ పింఛనును లబ్ధిదారు తుంగల సాంబశివరావుకు వలంటీర్ రహమాన్ అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రీరాం (చిన్నా), గృహ సారథులు నాగలక్ష్మి, పండు, దుర్గ పాల్గొన్నారు.

- కృత్తివెన్ను: మండల వ్యాప్తంగా మొత్తం 7,149 పింఛన్లు ఉండగా వేకువజాము నుంచే వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేస్తున్నారని ఎంపీడీఓ పిచ్చిబాబు తెలిపారు. వ్యవసాయ పనుల నేపథ్యంలో పంటపొలాల వద్దకు వెళ్లి వలంటీర్లు లబ్ధిదారులకు పింఛను సొమ్ము అందజేశారని చెప్పారు. మొదటి రోజు శుక్రవారం 82 శాతం మందికి పింఛన్లను అందజేశారని వివరించారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

కోడూరు: విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. కోడూరులో నూతనంగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్తంభాలను రమేష్‌బాబు శుక్రవారం ప్రారంభించారు. 11 కేవీ విద్యుత్ లైన్‌కు సంబంధించి గతంలో ఏర్పాటు చేసిన షార్ట్ పోల్స్ వల్ల నిరంతరం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగేదని చెప్పారు. విద్యుత్ శాఖాధికారులు ఈ విషయంపై సమగ్రంగా పరిశీలించి మండల కేంద్రంలో ఉన్న 30 షార్ట్ పోల్స్‌ను తొలగించి, ఆ స్థానంలో నూతనంగా విద్యుత్ పోల్స్‌ను ఏర్పాటు చేయనున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ స్తంభాలు ఏర్పాటు వల్ల లోఓల్టేజీ సమస్య తగ్గడంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు కూడా విద్యుత్ సరఫరాను అవరోధాలు లేకుండా అందించవచ్చని చెప్పారు. ఆక్వా రైతులకు మేలు చేకూర్చేలా ఇప్పటికే రామకృష్ణాపురం వద్ద నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ కూడా నిర్మిస్తున్నామన్నారు. ఇటీవల భావదేవరపల్లి నుంచి మందపాకల వరకు నూతనంగా విద్యుత్ పోల్స్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, డీఈఈ సుబ్రహ్మణ్యేశ్వరరావు పాల్గొన్నారు.

ఖాతాదారునికి పరిహారం చెల్లించండి

చిలకలపూడి(మచిలీపట్నం): సేవాలోపం కారణంగా ఖాతాదారునికి పరిహారం చెల్లించాలని వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు చింతలపూడి కిషోర్‌కుమార్, సభ్యులు నందిపాటి పద్మారెడ్డి, శ్రీలక్ష్మీరాయలు శుక్రవారం తీర్పు చెప్పారు. గుడివాడ పట్టణానికి చెందిన ఎస్. దుర్గామల్లేశ్వరరావు విజయా బ్యాంక్ క్రెడిట్ కార్డు కలిగి ఉన్నాడు. క్రెడిట్ కార్డుకు సంబంధించి మెడిక్లయిమ్, గ్రూప్ పర్సనల్ యాక్సిడెంట్ పాలసీ ఉంది. బ్యాంకు నిబంధనల ప్రకారం ప్రతి ఏడాది డిసెంబర్‌లో ప్రీమియం మొత్తాన్ని మినహాయిస్తున్నారు. అదే విధంగా 2019లో విజయ బ్యాంక్ బ్యాంక్ ఆఫ్ బరోడాలో విలీనం కావడంతో 2020 జనవరి 1వ తేదీన ప్రీమియం బ్యాంక్ ఆఫ్ బరోడా మినహాయించినప్పటికీ మెడిక్లయిమ్ పాలసీ రెన్యువల్ చేయలేదు. రెన్యువల్ చేయాలని మల్లేశ్వరరావు బ్యాంక్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదు. బాధితుడు వినియోగదారుల ఫోరంను ఆశ్రయించాడు. ఈ విషయంపై ఫోరం సభ్యులు విచారణ చేసి ఖాతాదారునికి మానసిక వేదన, సర్వీస్ లోపం కలిగించినందుకు రూ. 3 లక్షలు ఇవ్వాలని తీర్పు చెప్పారు. తీర్పు వెలువడిన 30 రోజుల్లోగా సొమ్ము చెల్లించాలని పేర్కొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

చిలకలపూడి(మచిలీపట్నం): న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందజేస్తామని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలోని ఏఆర్‌టీ సెంటర్‌లో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రతి శనివారం ప్రభుత్వాస్పత్రిలో ఒక న్యాయవాది, పారా లీగల్ వలంటీర్ ఉంటారని, సమస్యలు ఏమైనా వారికి తెలియజేస్తే వాటిని పరిష్కరిస్తారని వివరించారు.

బంగారు నాణెం అందజేత

బంటుమిల్లి: పెందుర్రు గ్రామానికి చెందిన పాడి రైతు మారుబోయిన నాగేంద్రకుమార్ (నాని) కుమార్తె వివాహాన్ని పురస్కరించుకుని కల్యాణమస్తు పథకంలో భాగంగా కృష్ణా మిల్క్ యూనియన్ జిల్లా డైరెక్టర్ అర్జా నగేష్‌బాబు బంగారు నాణెంను అందజేశారు. శుక్రవారం స్థానిక పాల కేంద్రం వద్ద జరిగిన కార్యక్రమంలో గుడ్లవల్లేరు చిల్లింగ్ సెంటర్ మేనేజరు తోట సత్యనారాయణ, పాల కేంద్రం అధ్యక్షుడు బోయిన ప్రసాద్, సూపర్‌వైజర్, రైతులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఓటర్ల మార్పులకు ప్రత్యేక శిబిరాలు

పెడన: పెడన నియోజకవర్గంలో కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునేందుకు, చిరునామాలు మార్చుకునేందుకు, చనిపోయిన వారి కుటుంబ సభ్యుల పేర్లను తొలగించుకునేందుకు శని, ఆదివారాలు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశామని పెడన ఎన్నికల అధికారి కె. రాజ్యలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెడన నియోజకవర్గ వ్యాప్తంగా పెడన పట్టణంతో పాటు పెడన రూరల్, గూడూరు, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లో 216 పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి శిబిరంలో బూత్‌లెవెల్ అధికారి ఉంటారని, వారి ద్వారా కొత్తగా ఓటరుగా చేరవచ్చునన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు.

నీటి సరఫరా బంద్‌తో ఇబ్బందులు

పెదప్రోలు(మోపిదేవి): పంచాయతీ అధికారులు, పాలకవర్గం నిర్లక్ష్యంతో తాగునీరు సరఫరా కాక పెదప్రోలు గ్రామస్తులు శుక్రవారం ఇబ్బందులకు గురయ్యారు. పెదప్రోలు పాలకవర్గం గత ఫిబ్రవరిలో టెండర్ ప్రకటన ద్వారా కాంట్రాక్టు కార్మికులను నియమించింది. కాంట్రాక్టు ఎంపిక విధానంలో లోపం ఉందని స్థానికుడు కొల్లూరు రామకృష్ణ డీఎల్‌పీఓ, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి కాంట్రాక్టు సిబ్బందికి వేతనాలు నిలిపివేశారు. గత 9 నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో శుక్రవారం నుంచి సిబ్బంది విధులను బహిష్కరించారు. శుక్రవారం ఉదయం, సాయంత్రం మంచినీరు వదలక పోవడంతో గ్రామస్తులు ఇబ్బందులకు గురయ్యారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని, లేకుంటే సమ్మెను కొనసాగిస్తామని కాంట్రాక్టు సిబ్బంది తెలిపారు. దీనిపై ఇన్‌చార్జి గ్రామ కార్యదర్శి రామకోటేశ్వరరావును వివరణ కోరగా సిబ్బందితో సంప్రదింపులు చేస్తున్నామని చెప్పారు.

- ఆర్థికసాయం అందజేత

మోపిదేవి వార్పు(మోపిదేవి): మోపిదేవి వార్పుకు చెందిన పరుచూరి యుగంధర్ గుండెపోటుతో ఇటీవల మృతిచెందాడు. వారి పిల్లలకు అవనిగడ్డ ఎంపీపీ తుంగల సుమతీదేవి, అంకాలరావు దంపతులు రూ. 10 వేలను శుక్రవారం ఆర్థిక సాయంగా అందజేసి ధైర్యం చెప్పారు.